ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

3★

శుక్రవారం 5 సెప్టెంబరు 2025

బీటీ రోడ్లకు రూ. 11.27 కోట్లు మంజూరు

పెద్దపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి నియోజకవర్గంలో రెండు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ 11 కోట్ల 27 లక్షల రూపాయలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం నుంచి చెంచుల వాడ, పెద్దరాతుపల్లి మీదుగా రోడ్డుకు 10 కోట్ల రూపాయలు, ఎలిగేడు మండలం నర్సాపూర్ శివాలయం నుంచి రాముల పల్లి వరకు రోడ్డుకు కోటి 27 లక్షల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎమ్మెల్యే విజయరమణారావు కృతజ్ఞతలు తెలిపారు.

దెబ్బతిన్న పంటల సర్వే



దెబ్బతిన్న పంటలను సర్వే చేస్తున్న ఏఈఓ

మంథనిరూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల కారణంగా దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు రెండు రోజులుగా సర్వే చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో రెండు సార్లు గేట్లు ఎత్తి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయడంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో సిరిపురం, ఉప్పట్ల, పోతారం, విలోచవరం గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. వరద ఉధృతి తగ్గడంతో వ్యవసాయాధికారులు నష్టపోయిన పంటలను సర్వే చేస్తున్నారు. నది పరివాహక ప్రాంతాల్లో గుంజపడుగు, నాగారం క్లస్టర్ పరిధిలోని ఏఈవోలు శివకుమార్, స్రవంతిలు పంటలను సందర్శించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని వారు తెలిపారు.

గణపతి నిమజ్జనానికి సర్వం సిద్ధం

- గోదావరి వంతెన వద్ద పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల గణనాథుల నిమజ్జనం
- సింగరేణి సహకారంతో విస్తృత ఏర్పాట్లు
- చౌరస్తాలో శోభాయాత్రకు స్వాగత ఏర్పాట్లు
- సీసీ కెమెరాలు.. భారీ బందోబస్తు



కోల్‌సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గణనాథుల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నవరాత్రులు పూజలందుకున్న వినాయకులను శుక్రవారం గోదావరి నదిలో నిమజ్జనం చేయనున్నారు. రామగుండంతో పాటు మంచిర్యాల జిల్లాలోని నస్పూర్, శ్రీరాంపూర్, జైపూర్ ప్రాంతాల గణపతులను కూడా ఇక్కడే నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సింగరేణి, ఎన్‌పీడీసీఎల్, హెచ్‌కేఆర్, ఎన్‌టీపీసీ సహకారంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి వంతెనకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేశారు. రామగుండం నగరపాలక సంస్థ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని రామగుండం, ఎన్‌టీపీసీ, యైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శోభాయాత్ర జరిగే రూట్లలో లైటింగ్ ఏర్పాట్లు చేసింది. మెయిన్ చౌరస్తాలో గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు.

గోదావరి వంతెన వద్ద 25 ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసి అక్కడి నుంచే నదిలో గణనాథులను నిమజ్జనం చేసేలా చర్యలు చేపడుతున్నారు. సింగరేణి సంస్థ ప్లాట్‌ఫాంలను, క్రేన్‌లను సమకూర్చుతోంది. ఎన్‌పీడీసీఎల్ గోదావరి రెండు వంతెనలు, పుష్కర ఘాట్ ప్రాంతాల్లో లైటింగ్ అవసరాలకు ప్రత్యేకంగా అదనపు ట్రాన్స్ ఫార్మర్లను బిగించింది. ఫిషరీస్ విభాగం ఆధ్వర్యంలో స్పీడ్ బోట్‌ను, 25మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. గోదావరి నది నిండు కుండలా ప్రవహిస్తుండడంతో సమ్మక్క - సారలమ్మ పుష్కర ఘాట్‌వైపు దారిని మూసివేశారు.



వంతెన వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

నిఘా నీడలో నిమజ్జనం.. భారీ బందోబస్తు..

గోదావరిఖని గోదావరి వంతెన వద్ద శుక్ర, శనివా రాల్లో రెండు రోజుల పాటు రామగుండం, మంచిర్యాల జిల్లాల్లోని కోల్‌బెల్ట్ ప్రాం తాల నుంచి గణనాథులను నిమజ్జనం చేయనున్నారు. నిమజ్జనానికి సంబంధించి శోభాయాత్రను డ్రోన్ కెమెరాలతో పోలీసులు పర్యవేక్షిం చనున్నారు. గోదావరి వంతెన వద్ద 25సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అక్కడే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించనున్నారు. జైపూర్, గోదావరిఖని, ఏసీపీలు, ట్రాఫిక్ ఏసీపీ, కోల్‌బెల్ట్ సీఐలు, ఆర్‌ఐలు బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పెద్దపల్లి జోన్ పరిధిలో ముగ్గురు ఏసీపీలు, 8మంది సీఐలు, 24మంది ఎస్‌ఐలు, 180మంది కానిస్టేబుళ్లు, 32మంది హోంగార్డులు, ఏఆర్ స్పెషల్ పార్టీకి చెందిన 32మంది, ఎస్‌అండ్‌పీసీ నుంచి 100మందితో పాటు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ కెడెట్లు సేవలందించనున్నారు.

పరిశీలించిన ఎమ్మెల్యే, సీపీ

గోదావరి వంతెన వద్ద నిమజ్జన ఏర్పాట్లను గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీలు రమేష్, వెంకటేశ్వర్ పరిశీలించారు. నదిలో నీటి మిగతా 6లో

సింగరేణిలోని నాలుగు గనులకు అవార్డులు

జాతీయ స్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్

గోదావరిఖని, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి లోని నాలుగు బొగ్గు గనులకు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. గురువారం ముంబైలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ బలరాంనాయక్ అవార్డులు అందుకున్నారు. ప్రతిష్ఠాత్మక మైన ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డులు అందుకున్న సింగరేణి గనుల్లో రామగుండం ఏరియా-3కి చెందిన ఓసీపీ-1 ఎక్స్‌టెన్షన్, ఇల్లందు ఏరియాకు చెందిన జేకే-5 ఓసీపీతో పాటు భూగర్భ గనుల్లో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఆర్‌కే-6, ఆర్‌కే న్యూటెక్ గనులు ఉన్నాయి. ఈ స్టార్ రేటింగ్ ఎంపికకు బొగ్గు గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, సౌకర్యాలు, పర్యావరణ హిత చర్యలు, కార్మిక సంక్షేమం లాంటి 84అంశాలను పరిగణలోకి తీసుకుని మార్కులు కేటాయించి ఎంపిక చేస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రమాణాలు కలిగి ఉన్న గనులపై కేంద్ర బొగ్గు శాఖ నుంచి వచ్చిన పరిశీలక బృందం అత్యుత్తమ గనులను ఎంపిక చేస్తుంది. మొత్తం 100మార్కుల్లో 91 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. ఇవే కాకుండా సింగరేణిలోని మరో 14గనులు ఫోర్ స్టార్ల రేటింగ్‌లో నిలిచాయి. మరో 20గనులు త్రీ స్టార్ రేటింగ్ లభించింది. గతంలో ఎప్పుడు కూడా సింగరేణి బొగ్గు గనులు స్టార్ రేటింగ్ సాధించలేదు. ఫైవ్ స్టార్ రేటింగ్‌కు సింగరేణి నుంచి నాలుగు గనులు ఎంపిక కావడంపై సంస్థ సీఎండీ బలరాంనాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఆయా గనుల అధికారులకు, కార్మికులకు అభినందనలు తెలిపారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సింగరేణి సీఎండీ బలరాంనాయక్

జీఎస్టీ తగ్గింపుతో ఊరట



పెద్దపల్లి జెండా చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీఎస్టీ తగ్గించడంపై హర్షిస్తూ బీజేపీ పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో గురువారం జెండా చౌరస్తా వద్ద ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన న్యూఢిల్లీలో జీఎస్‌టి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల ఉత్పత్తుల నుంచి ఆటో మొబైల్స్ వరకు జీఎస్టీ రేట్లపై కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అలాగే రోజువారీ వినియోగ వస్తువులపై పన్ను రేట్లను తగ్గించడానికి వస్తువులు, సేవల పన్ను సవరణలపై నిర్ణయం తీసుకున్నారని, తగ్గించిన జీఎస్టీతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట లభించనున్నదన్నారు. పెంజర్ల రాకేష్, వేల్పుల రమేష్, తంగేడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, గుడ్ల సతీష్, బోలోవేన సురేందర్, మామిడి ఉమేష్, బొడ్డుపల్లి కుమార్, ముంజ రాజేంద్రప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటయోధుడు సురవరం



సురవరం సుధాకర్ రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక వర్గాల కోసం సురవరం సుధాకర్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన మొదటి కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరతకు బీజేపీ ప్రభుత్వమే కారణమని, తెలంగాణలో ఆర్‌ఎఫ్‌సీఎల్ ఎరువుల కర్మాగారాన్ని మూసి వేశారని, దాని నుంచి ఉత్పత్తి వస్తే రైతులకు యూరియా కొరత తగ్గేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కర్మాగారాన్ని నిర్లక్ష్యం చేసి యూరియా కొరతకు కారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మంత్రులు యూరియా దిగుమతికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తెలంగాణ రైతులకు యూరియా అందేలా చూడాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 20 నెలలైనా స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఈనెల 11నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మడ్డి ఎల్లాగౌడ్, వైవిరావు, స్వామి, ఎంఏ గౌస్, రామ్ చందర్, రాజారత్నం, సునీల్, మార్కాపురి సూర్య, బాలసాని లెనిన్, చంద్రశేఖర్, ఎం శంకర్, రమేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, నవీన్ పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధికి పాటుపడాలి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని యువత అన్నిరంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధికి పాటుపడాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత కొండ రవి యాదవ్ అన్నారు. యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో గురువారం మాట్లాడారు. యువత చేడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. దేశంలోని వివిధ రకాల సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు సన్నద్ధం కావాలన్నారు. కొండ రవి గీతాలు ఆలపిస్తూ సామాజిక అంశాలపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. డాక్టర్ యాట ప్రసాద్, డాక్టర్ సాంబశివ రావు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ నరేష్, శంకర్, పాల్గొన్నారు.

అధిక పనిభారం.. అరకొర వేతనం



ఉపాధిహామీ కూలీ పనులు చేయిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

- ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల అగచాట్లు
- మూడు నెలలకోసారి వేతనాలు
- అప్పులతో కుదేలవుతున్న బతుకులు
- వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి వేడుకోలు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రభుత్వం గ్రామానికి ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించింది. ఈ పథకాన్ని 2006లో ప్రవేశపెట్టగా ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.1200 చెల్లించారు. ఉపాధిహామీలో చేపడుతున్న పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. అధిక పనిభారం.. అరకొర వేతనంతో ఫీల్డ్ అసిస్టెంట్లు సతమతమవుతున్నారు. మూడు నెలలకు ఒకసారి వేతనం ఇవ్వడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడు తున్నామని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. గత 19 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఈజీఎస్‌లో పని చేస్తున్నారు. వేతనాలు పెంచి, క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేకుండా పోయిందని పలు వురు ఫీల్డ్ అసిస్టెంట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కేవలం రూ.10,200 జీతానికి తాము పని చేస్తున్నామని, అవి ఎటు సరిపోవడం లేదని వారు అంటున్నారు. దీంతో తమకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొంటు న్నారు. గ్రామాల్లో చేసే ప్రతి పనికి ఫీల్డ్ అసిస్టెంట్లు ముందు వరుసలో ఉండాలి.

ఎస్సారెస్పీ కాలువలు, చెరువు పూడిక తీతలు, గుట్ట చుట్టు కందకాలు, రోడ్లకి ఇరువైపులా చెట్లు నాటడం, వ్యవసాయ భూములకు రహదారులు నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, పశువుల షెడ్లు, కోళ్ల ఫారాలు, డంపింగ్ యార్డ్, శ్మశాన వాటిక, హార్టికల్చర్, సోప్‌పిట్ తదితర పనుల్లో అధికారులు తమకే బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఎంతో బాధ్యతగా పని చేస్తున్నా ప్రభుత్వాలు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఎన్నోమార్లు జీతాలు పెంచుతామని ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలి పోయాయి. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలని పేర్కొంటున్నారు.

రెండు నెలలుగా జీతాలు రావడం లేదు

వెల్తురు కుమార్, వెన్నంపల్లి



ఉపాధి హామీ పథకం ప్రారంభమైన నాటి నుంచి పని చేస్తున్నా. జీతాలు రెండు, మూడు నెలలకోసారి వస్తాయి. ఒక్కోసారి ఐదు నెలలకు కూడా వస్తుంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారడంతోపాటు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం జీతాలు పెంచి నెలనెలా వచ్చేలా చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వం జీతాలు పెంచి ఆదుకోవాలి

శనిగరపు వసంత, కిష్టంపేట

ప్రభుత్వం జీతాలు పెంచి ఆదుకోవాలి. గ్రామాల్లో జరుగుతున్న ప్రతి పని ఈజీఎస్‌లో భాగంగా మేము భాగస్వామ్యం కావాల్సిందే. అలుపెరగకుండా పని చేస్తున్నాం. జీతాలు నెల నెల వచ్చేలా చర్యలు తీసుకోవాలి.



టాస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



టాస్క్ ప్రతినిధులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యువతీ, యువకులు టాస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో టాస్క్ ప్రతినిధులు, కోఆర్డినేటర్‌తో సమావేశం నిర్వహించారు. డిగ్రీ, ఇంజనీరింగ్, వివిధ వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన వారిలో ప్రస్తుతం 30 శాతం అభ్యర్థులకే ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని, వీటిని కనీసం 60 నుంచి 65 శాతానికి పెంచడమే లక్ష్యంగా టాస్క్, టీ హబ్, టీ వర్క్స్ వంటి సంస్థలు పని చేస్తున్నాయని వివరించారు. టాస్క్, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయ ఆధ్వర్యంలో 2023-2024, 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు టెలిపెర్ఫార్మెన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో కల్పిస్తారని తెలిపారు.

యువతీ, యువ తకు సాఫ్ట్ స్కిల్స్, ఇతర నైపుణ్య శిక్షణ 15 రోజుల పాటు అందిస్తారని, శిక్షణ తర్వాత అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పెద్దపల్లి ప్రాంతీయ టాస్క్ సెంటర్‌లో ఈ నెల 10 లోగా రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇందులో శిక్షణ పొందిన అభ్యర్థులకు రూ.3 నుంచి 7 లక్షల ప్యాకేజీలతో మల్టీనేషనల్ కంపెనీలలో ఉపాధి లభించిందని కలెక్టర్ తెలిపారు. అలాగే పలు డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో నైపుణ్య శిక్షణ గురించి ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. టాస్క్ ప్రతినిదులు ప్రదీప్‌రెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ సుధీర్, టెలిపెర్ఫార్మెన్స్ కంపెనీ ప్రతినిధులు గీతు చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ అతుల్ శర్మ, జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు, మేనేజర్ గంగ ప్రసాద్, టాస్క్ కోఆర్డినేటర్ కౌసల్య తదితర అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధనపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మెరుగైన విద్యాబోధన అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ఇటీవల వచ్చిన పదోన్నతుల కారణంగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత రాకుండా మండల పరిధిలో అవసరమైన సర్దుబాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో సింగిల్ టీచర్ స్కూళ్ల సంఖ్య తగ్గించాలన్నారు. అవసరమైన చోట హెల్పర్‌ల ఏర్పాటు అవకాశాలపై రిపోర్టు అందించాలన్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందించి బోధన విధానం మెరుగయ్యేలా చూడాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాల్లో సబ్జెక్టు వారీగా సిలబస్ డిస్కస్ చేయాలని తెలిపారు. జడ్పీ సీఈఓ నరేందర్, ఎస్‌ఓలు షేక్, మల్లేష్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 10 నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10 నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా విద్యార్థులు, టీచర్ల హాజరు వంద శాతం నమోదు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారు లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ టీచర్లు, విద్యార్థులు తప్పనిసరిగా ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు. పాఠశాల వివరాలను యూడిఐసిలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు 80 శాతం విద్యా ప్రమాణాలు అందుకునేలా చూడాలన్నారు. ఎస్‌ఓ షేక్, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్ మాస్టర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం వెన్నంపల్లిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలోని పలు వినాయకుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, వడ్లకు బోనస్, ఉచిత కరెంటు, ఎకరాకు రూ.6 వేల పెట్టుబడి సాయం, సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అందిస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, కలవేన రమేష్, వెల్తురు రమేష్, బంగారురమేష్, మాదాసు సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

108 దీపాలతో అలంకరణ



ఎలిగేడు, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుని మండపంలో బుధవారం మహిళలు 108 దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉం డాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని వారు విఘ్నేశ్వరున్ని వేడుకున్నట్లు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష

- బాధితురాలికి రూ.ఐదు లక్షలు పరిహారం
- చెల్లింపునకు లీగల్ సెల్ అథారిటీకి సిఫారసు

4

మావోయిస్టులు గోపగాని ఐలన్న, కుమారస్వామిల తల్లి మృతి


కొమరమ్మ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు గోపగాని ఐలన్న, కుమరస్వామిల తల్లి గోపగాని కొమరమ్మ(92) మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం ఉదయం మృతి చెందారు. గోపగాని కొమరమ్మకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె కాగా ఇద్దరు కుమారులు గోపగాని ఐలన్న, గోపగాని కుమరస్వామిలు నాటి పీపుల్స్‌వార్ పార్టీలో క్రియాశీల కంగా పనిచేశారు. గోపగాని కుమారస్వామి 1979లో కమలాపూర్ మండలం గూడూరులో ఏర్పడిన తొలి దళంలో సభ్యుడిగా చేరారు. దళంలో పనిచేస్తున్న సమయంలోనే గ్రెనేడ్ ప్రమాదంలో మృతిచెందగా మరో కుమారుడు ఐలన్న పీపుల్స్ వార్ పార్టీకి ఉత్తర తెలంగాణరీజనల్ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో కిడ్నాప్‌నకు గురయ్యాడు. 37ఏళ్లు దాటినా ఆచూకీ లభించడం లేదు. కిడ్నాప్ కలకలం అప్పట్లో సంచలనం సృష్టించగా పలువురు రాజకీయ ప్రముఖులు ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. కాగా కుమారుడి ఆచూకీ కోసం ఎదురు చూసిన తల్లికి చివరికి నిరాశే మిగిలి మృతిచెందింది. కొమురమ్మ మృతిపట్ల పలువురు ప్రముఖులు, ప్రజలు నివాళులర్పించారు.

ఐదు రోజుల క్రితం..

ఇంట్లో నుంచి వెళ్లి శవమై తేలాడు

● పురుగుల మందు తాగి బలవన్మరణం చెందిన గొర్రెల కాపరి


రాజయ్య(ఫైల్)

గొల్లపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన జక్కుల రాజయ్య(50) అనే గొర్రెల కాపరి గత ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లి ఐదురోజుల అనంతరం గ్రామరెవెన్యూ పరిధిలోని చింతామణి కుంట సమీపంలో గురువారం శవమై తేలాడు. దీంతో బాధిత కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజయ్య గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బయటికి వెళ్లిన వ్యక్తి రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది చుట్టు పక్కల అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే, గతంలో ఒకట్రెండు సార్లు ఇలాగే ఇంట్లో ఎవరికీ చెప్పాపెట్టకుండా వెళ్లివచ్చాడు. ఎప్పటిలాగే తిరిగి వస్తాడనుకుని అతడి రాకకోసం ఎదిరిచూస్తున్నారు. ఈ క్రమంలో గురు వారం గొర్రెల కాపరులు గొర్రెల మందను తోలుకుంటూ చింతామణి కుంట వైపు వెళ్లగా దుర్వాసన రావడంతో దగ్గరికెళ్లి చూడగా రాజయ్య మృతదేహం కనిపించింది. దీంతో వారు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి వెళ్లి కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించి వివరాలు సేకరించారు. అయితే, శవం పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడాన్ని గుర్తించిన పోలీసులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానిస్తున్నారు. తన భర్త కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడని, ఆరోగ్యం నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య శంకరవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెంకటాపూర్‌లో చోరీ

● కేసు నమోదు ● కత్తులు అపహరించిన దొంగలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో రెండు దుకాణాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి గురువారం తెలిపారు. చికెన్ సెంటర్ లోని కత్తులను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని సల్వాజీ వెంకట్ స్థానికంగా చికెన్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. దుకాణం తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు రూ.2వేల విలువైన నాలుగు కత్తులను ఎత్తుకెళ్లారు. అక్కడనుంచి బస్టాండు ప్రాంతంలోని ముత్యం రాజుకు చెందిన కిరాణ దుకాణంలో చోరీకి విఫలయత్నం చేశారు. దుకాణం షటరును పైకి ఎత్తేందుకు ప్రయత్నించారు. శబ్దం వినిపించడంతో దుకాణం వెనుకాల కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న రాజు మేల్కొని కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. బాధితుడు సల్వాజీ వెంకట్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

పత్తి రైతుల కోసం కపాస్ కిసాన్



● కొనుగోళ్ల కోసం ప్రత్యేక యాప్ ● ఏర్పాటు చేసిన సీసీఐ

చొప్పదండి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల కోసం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కపాస్ కిసాన్ అనే ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చింది. ఇకపై సీసీఐ పత్తి కొనుగోళ్లను యాప్ ద్వారానే చేపట్టనుంది. గత సోమవారం నుంచి రైతులకు యాప్ అందుబాటులోకి రాగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి మాత్రమే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తున్నది. సెప్టెంబరు 30లోగా కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. రైతు రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పత్తిని సీసీఐకి విక్రయించే అవకాశం ఉంటుంది. తద్వారా రైతుకు మద్దతు ధర లభిస్తుంది. దేశవ్యాప్తంగా సీసీఐ యాప్ ద్వారానే



పత్తి కొనుగోలు చేసేందుకు 2025-26 సంవత్సరానికి సంబంధించి యాప్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. పత్తికి కనీస మద్దతు ధర క్వింటాలుకు 8,110 రూపాయలు ప్రకటించగా మద్దతు ధర పొందాలంటే రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

30 లోగా నమోదు చేసుకోవాలి...

పత్తి సాగు చేసిన రైతులు ఈ నెల 30 లోగా కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకంతోపాటు పత్తి సాగు చేసిన భూమి సర్వే నంబర్, ఆధార్ నంబర్‌తోపాటు ఇతర వివరాలను అందులో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రెవెన్యూ అధికారుల నుంచి పత్తి పంట ధ్రువీకరణ పత్రం, గ్రామం, మండలం, జిల్లా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. సాగు చేసిన విస్తీర్ణంతోపాటు ఇతర వివరాలను నమోదు చేయగానే సీసీఐకి వివరాలు చేరిపోతాయి.

ఎక్కడ ఎంత విస్తీర్ణం సాగుచేశారనే గణాంకాలు సీసీఐకి తెలిసి పోతాయి. వీటి ఆధారంగా సీసీఐ పత్తి కొనుగోళ్లను చేపడుతుంది. రైతులకు కనీస మద్దతు ధర అందుతుంది.

స్లాట్ బుకింగ్‌తో కొనుగోళ్లు...

కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు ఎంచుకున్న మార్కెట్ యార్డుకు సంబంధించి పత్తిని విక్రయించేందుకు రైతులు ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవాలి. ఏ రోజున సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించాలో వివరాలను యాప్‌లో రైతుకు సమాచారం అందుతుంది. స్లాట్ బుక్ అయిన రోజు మాత్రమే రైతులు పత్తిని విక్రయించాల్సి ఉంటుంది.

రైతులు రోజుల తరబడి సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తిరగాల్సిన పనిలేకుండా స్లాట్ బుకింగ్‌తో సూచించిన రోజునే విక్రయించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఫలితంగా దళారులకు చెక్ పెట్టే అవకాశం ఏర్పడుతుందని, రైతులకు మద్దతు ధర దొరుకుతుందని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల పత్తి పంట చేతికి అవకాశం ఉండగా రైతులు ఈ నెలాఖరులోగానే కపాస్ కిసాన్ యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీల సీజ్

ముత్తారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం మీదుగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నలారీలను అధికారులు గురువారం సీజ్‌చేశారు. నేషనల్ హైవేరోడ్డు పనులకు కావలసిన మట్టిని అనుమతులు లేకుండా 15రోజులుగా తరలిస్తున్నారు. స్థానికులకు అనుమానం వచ్చి అనుమతులు ఉన్నాయాఅని అడగగా సూపర్‌వైజర్లు బెదిరింపులకు గురిచేశారు. స్థానికులు మైనింగ్‌శాఖ అధికారులకు ఫిర్యాదుచేయగా గురువారం అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీలను పట్టుకొని ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పారుపల్లి గ్రామం పక్కన ఉన్న గుట్టనుంచి అనుమతులు లేకుండా తవ్వకాలుజరిపిమట్టిని తరలిస్తున్నారు. మైనింగ్ అధికారులు 3లారీలనుపట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి వాటిని సీజ్ చేశారు.

నేడు కరీంనగర్‌లో ట్రాఫిక్ మళ్లింపు

● నిబంధనలు పాటించి సహకరించాలి
● పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నిమజ్జనం సందర్భంగా శుక్రవారం కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం ప్రకటించారు. ప్రజలు. వాహనదారులు ఈ మళ్లింపులకు సహకరించి ప్రయాణ సౌలభ్యాన్ని పాటించాల్సిందిగా కోరారు.

● మానకొండూర్ నుంచి..

- హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వచ్చే వాహనాలు మానకొండూర్ పల్లె బస్టాండ్‌వద్ద నుంచి ముంజంపల్లి, పోరండ్ల వైపు మళ్లిస్తారు. ఆ తర్వాత తిమ్మాపూర్ వద్ద రాజీవ్ రోడ్డుకు చేరుకుని, అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లవచ్చు.

- నిమజ్జనం తర్వాత తిరిగి వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో అంటే ముంజంపల్లి, పోరండ్ల మీదుగా తిమ్మాపూర్‌కు చేరుకుని, అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లాలి.

- కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఎలాంటి మళ్లింపులు ఉండవు. అవి యథావిధిగా తమ మార్గంలో ప్రయాణించవచ్చు.

● కొత్తపల్లి నుంచి..

- జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వచ్చే వాహనాలను వెలిచాల ఎక్స్ రోడ్డు వద్ద మల్కాపూర్, చింతకుంట, పద్మనగర్ ఎక్స్ రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం మీదుగా సిరిసిల్ల బైపాస్ రోడ్డు నుంచి కరీంనగర్ పట్టణానికి మళ్లిస్తారు.

- కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలకు అవసరమైనప్పుడు రేకుర్తి జంక్షన్ వద్ద యూనివర్సిటీ ఎక్స్‌రోడ్డు, మల్కాపూర్ వైపు మళ్లించి, వెలిచల ఎక్స్ రోడ్డు వద్ద జగిత్యాల రోడ్డుకు చేరుకుంటారు.

● నిమజ్జనం పాయింట్ల వద్ద..

- చింతకుంట, కొత్తపల్లిలలో నిమజ్జనం తర్వాత, ఈ పాయింట్ల వద్దకు వచ్చిన వాహనాలు యూటర్న్ తీసుకుని అదే మార్గంలో కరీంనగర్‌కు తిరిగి వెళ్లాలి.

సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకు గ్రానైట్, ఇతర భారీ సరుకు రవాణా వాహనాలను ఈ మార్గాలలో అనుమతించరు. ఈ నిబంధనలను తప్పక పాటించాలని

వృద్ధురాలి పోషణను పట్టించుకోని కుమారుడు

● ఇల్లు విడిచి వెళ్లిన తల్లి
● సఖి కార్యాలయానికి తరలించిన అధికారులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలైన తల్లి పోషణను కుమారుడు పట్టించుకోకపోవడంతో ఆమె ఇంటిని వదిలి బయటకువెళ్లింది. వినాయక మండపాలవద్ద తింటూ చెట్లకింద సేదతీరుతున్న వృద్ధురాలిని గురువారం స్థానికులు గమనించి జిల్లా సంక్షేమాధికారికి బొనగిరి నరేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఫీల్డ్‌రెస్పాన్స్ అధికారి కొండయ్యను పంపించి జిల్లా కేంద్రంలోని సఖి కార్యాలయానికి వృద్ధురాలిని పంపించారు. బాధితురాలి కథనం ప్రకారం.. జగిత్యాల మండలం ధరూర్ గ్రామానికి చెందిన నాకుమల్ల కిష్టమ్మ అనే వృద్ధురాలు తనకున్న ఇంటిని తనకుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేసింది. కొన్ని రోజులుగా కొడుకు, కోడలు సరిగా చూసుకోకపోవడంతో ఆరురోజుల క్రితం ఇంటిని వదిలివచ్చింది. వృద్ధురాలు జగిత్యాల విద్యానగర్‌లో ఉన్న రామాలయం వద్ద గణపతి మండలం వద్ద తింటు అక్కడే ఉండడంతో గమనించిన స్థానికులు జిల్లా సంక్షేమాధికారికి సమాచారం అందించారు. తన కుమారుడు, కోడలు తనను తిట్టికొట్టి ఇంట్లోనుంచి వెళ్లగొట్టారని, ఎలాగైనా తన పోషణ బాధ్యత కొడుకు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారికి ఇచ్చినఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోల్‌సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్ వంకబెండు సమీపంలోని ఒకఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారంవన్‌టౌన్ పోలీసులు దాడి చేశారు. 7గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.11,840నగదు, ఏడు సెల్‌ఫోన్లను సీజ్‌చేశారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో ఓ వృద్ధురాలు బావిలో పడి మృతిచెందింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన అలువల లచ్చమ్మ (80)కు మతిస్థిమితం సరిగాలేదు. గురువారం ఇంట్లో నుంచి వెళ్లిన ఆమే బతుకమ్మకుంటవద్ద గల బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎల్ఎండీ పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

● బాధితురాలికి రూ.ఐదు లక్షలు పరిహారం చెల్లింపునకు లీగల్ సెల్ అథారిటీకి సిఫారసు

ఓదెల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు శీలారపు రమేష్‌కు గురువారం యావజ్జీవ శిక్షతోపాటు రూ.21వేలు జరిమానా విధిస్తూ పెద్దపల్లికోర్టు జడ్జి కె సునీత తీర్పునిచ్చారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిర్యాదుదారుడి మనుమరాలుమూడేళ్లక్రితం వేసవిసెలవుల్లో తాత ఇంటికి వచ్చింది. అమ్మమ్మ,తాత ఉపాధి హామీ పనికి వెళ్లగా పక్కఇంటి పిల్లలతో ఆడుకుంటోంది. ఇంటిసమీపంలో ఉన్న శీలారపు రమేష్ బాలికను అన్నం తినమని అతడి ఇంటిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడు. తీవ్రరక్తస్రావం అవుతున్న బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చిన అమ్మమ్మ, తాతకు జరిగినవిషయం చెప్పింది. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేశారు. ఏసీపీ సారంగపాణి కేసును పరిశీలించి మహిళా ఎస్‌ఐ మౌనికతో బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డు చేయించారు. అనంతరం నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మూడేళ్లపాటు పెద్దపల్లి ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేకకోర్టులో విచారణ కొనసాగింది. వాదోపవాదాలు విన్న అనంతరం రమేష్‌పై నేరం రుజువుకావడంతో జడ్జి కె సునీత ముద్దాయికి యావజ్జీవ కఠినకారాగార శిక్షతోపాటు రూ.21వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.5 లక్షలు పరిహారంగాచెల్లించాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీకి సిఫారసుచేశారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేష్ కీలకపాత్ర వహించారు. డీసీపీ కరుణాకర్, ఏసీపీగజ్జికృష్ణ పర్యవేక్షణలో సాక్ష్యులను ప్రవేశపెట్టి, నిందితుడికి శిక్షపడేలాకృషి చేసిన సీఐసుబ్బారెడ్డి, ఎస్సై దీకొండరమేష్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్‌ప్రాసిక్యూషన్ బృందాన్ని రామగుండం సీపీ అభినందించారు.


ఎదురెదురుగా ఢీకొన్న కారు, ట్రాక్టర్

● కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు


శంకరపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు.. ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డ సంఘటన శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి దేవాలయ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా గోపాలపూర్ గ్రామానికి చెందిన తీగల రాజేందర్, తీగల శ్రీనివాస్ కారులో కరీంనగర్ నుంచి హనుమకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో హుజూరాబాద్ వైపు నుంచి కేశవపట్నం వైపు వస్తున్న ట్రాక్టర్ కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై కొత్తగట్టు శివారులో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులోని వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయంతెలుసుకున్న కేశవపట్నం పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని ప్రమాదానికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

ఇసుక డంపుల స్వాధీనం


పట్టుకున్న ఇసుకను లారీలో తరలిస్తున్న అధికారులు

కథలాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని బొమ్మెన పెద్దవాగు శివారులో అక్రమంగా నిల్వఉంచిన ఇసుకడంపులను గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొందరు వ్యక్తులు కొద్దిరోజులుగా ఆ ప్రాంతంలో ఇసుకను నిల్వచేసి టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారని అధికారులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. 32ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకుని సూరమ్మచెరువు కాంట్రాక్టర్‌కు వేలంద్వారా విక్రయించామని ఎస్సై నవీన్‌కుమార్, ఆర్ఐనగేశ్ తెలిపారు. తక్కళ్ళపల్లి వాగు పరిసరాల్లో నిల్వ ఉంచిన 12ట్రిప్పుల ఇసుకనుకూడా వేలంవేసి విక్రయించినట్టు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి చెరువులో వ్యక్తి గల్లంతు


అనిల్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన దబ్బెట అనిల్(31) బంధువుల అంత్యక్రియలకు వెళ్లి స్థానిక గిద్ద చెరువులో స్నానం చేస్తూ గల్లంతైన ఘటన గురువారం చోటు చేసుకుంది. దబ్బెట రాధ ఇటీవల కరీంనగర్‌లో రోడ్డుప్రమాదంలో మృతి చెందింది. కుటుంబసభ్యులు స్వగ్రామమైన పందిల్లలో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం చెరువులో స్నానం చేస్తున్న క్రమంలో అనిల్ గల్లంతయ్యాడు. తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఆధ్వ ర్యంలో జాలర్లు చెరువులో పడవల ద్వారా గాలింపు చేపట్టారు. చీకటి కావడంతో గాలింపును నిలిపివేశారు. అనిల్‌కు భార్య ఉమా, కూతుళ్లు అన్విత, వినూత్న, తండ్రి రాజయ్య ఉన్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం


ధ్వంసమైన మొక్కజొన్న పంట

కథలాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాలలో బుధవారం రాత్రి అడవిపందులు దాడి చేయడంతో సుమారు ఐదెకరాల మొక్కజొన్న పంట ధ్వంసమైంది. నాలుగు నెలలు పంటను కాపాడుకుని చేతికొచ్చే దశలో ఉండగా అడవి పందులు పంటను నాశనం చేశాయని బాధితరైతులు మిట్టపల్లి గంగారెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరికొద్ది రోజుల్లో పంటను కోసుకునేందుకు సిద్ధమవుతుండగా పందుల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

బాబోయ్ కుక్కలు

● చిన్నారులు, వృద్ధులపై దాడులు


రాయికల్‌లో తిరుగుతున్న వీధి కుక్కలు

రాయికల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మున్సిపాలిటీలో కుక్కల దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయి. పట్టణంలో 12వార్డులు ఉండగా, సుమారు వెయ్యికుక్కల వరకు తిరుగుతున్నాయి. ఎక్కడ చూసినా గుంపుగుంపులుగా కుక్కలు ఉండటంతో చిన్నారులు ఆరుబయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. బల్దియాలో కుక్కలను నియంత్రించేవారు లేరు. పశు వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని కుక్కలు అంతుచిక్కని రోగంతో కనిపిస్తున్నాయి. కొన్ని కుక్కలు చర్మం ఊడిపోయి గజ్జి సోకినట్లు ఉంటున్నాయి. ఈ కుక్కలు ఎవరినైనా కరిస్తే తీవ్ర దుష్పరిణామాలు ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని, పశు వైద్యాధికారులు కుక్కలకు వ్యాక్సినేషన్ చేయాలని కోరుతున్నారు.

● పట్టణాల్లో పెరుగుతున్న కేసులు

గ్రామాలతో పోల్చుకుంటే 80శాతం కేసులు పట్టణంలోనే నమోదవుతున్నాయి. యానిమల్‌బర్త్ కంట్రోల్, జంతుసంరక్షణ బోర్డుఆఫ్‌ఇండియా నిబంధనల ప్రకారం వీధి కుక్కల సంఖ్య అదుపునకు శస్త్ర చికిత్సలు చేయాలన్నారు

● కుక్కలు దాడి చేస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు

✔ కుక్కలు కరిచిన ప్రదేశంలో మంచి నీరు, సబ్బుతో ఐదు నిమిషాలు పరిశుభ్రంగా కడగాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

✔ స్వల్పగాయాలకు (గీతలకు) మూడు డోసుల వ్యాక్సిన్ తీసుకోవాలి.

✔ రక్తస్రావమైన గాయాలకు నాలుగు డోస్‌ల వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి.

✔ కుక్కలు కరిచిన రోజు మొదటి డోస్, 3వ రోజు రెండో డోస్, 7వరోజు మూడోడోస్, 21వ రోజు నాలుడోడోస్ తీసుకోవాల్సి ఉంటుంది.

✔ తల భాగంలో ఎలాంటి జంతువులు గాయపరిచినా నాలుగు డోస్‌ల వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి.

✔ యాంటీరేబిస్ వ్యాక్సిన్ చేయించుకుని తగిన చికిత్స పొందాలి. ఆలస్యం, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాల మీదకు వస్తుంది.

✔ ప్రధానంగా ఇళ్లలోని పెంపుడుకుక్కలకు వ్యాక్సిన్ క్రమం తప్పకుండా వేయించాలి.

● నియంత్రణ చర్యలు తీసుకుంటాం..

మనోహర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్



నీళ్లు, ఆహారం దొరకక వీధి కుక్కలు దాడిగి దిగుతుంటాయి. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించి సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటాం. కుక్కల దాడిపై ఉన్నతాధికారులకు నివేదించి వాటి బెడద తగ్గించేందుకు కృషి చేస్తాం.

గుంతలమయంగా లో లెవల్ వంతెన

● ఇబ్బందుల్లో వాహనదారులు ● పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు


బురదమయంగా మారిన లోలెవల్ వంతెన

సైదాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్-హుజూరాబాద్ ప్రధానరహదారిలో సైదాపూర్ సమీపంలో గల లో లెవల్ వంతెన పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ప్రయాణం చేసేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒకవైపు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అందులో బురద పేరుకపోవడంతో వాహనాలు ఒకవైపు నుంచే వెళ్తున్నాయి. ఒక వైపు నుంచి వాహనాలు వెళ్లేవరకు ఇంకోవైపు వాహనాలు అక్కడే నిలపాల్సి వస్తోంది. గుంతల్లో టైర్లు పడి ఇబ్బంది అవుతోందని వాహనదారులు గుంతలున్న వైపు వెళ్లడం లేదు. ఇది ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. వర్షాలు ఎక్కువగా పడితే న్యాల చెరువు మత్తడి పడి రోడ్డుపై నుంచి నీరు ప్రవహించే అవకాశముంది. వర్షాలు ఎక్కువగా కురిసిన ప్రతీసారీ లోలెవల్ వంతెనలో నీరు పట్టక రోడ్డుపై నుంచి నీరు ప్రవహించి మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చాలా సంవత్సరాలుగా ఈ లోలెవల్ వంతెనను తొలగించి హైలెవల్ వంతెన నిర్మాంచాలనే డిమాండ్ ఉంది. చాలాసార్లు అప్పటి ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు, ఇప్పటి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్థానిక ప్రజలు విన్నవించారు. అయినా ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మించలేదు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సైదాపూర్ వద్ద గుంతలమయంగా మారిన లోలెవల్ వంతెన

ఉమ్మడిజిల్లా జూనియర్‌కళాశాలల ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా గుమ్మడి మధుజాన్సన్



మధు జాన్సన్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్ జిల్లా జూనియర్ కళాశాలల క్రీడాసమాఖ్య(ఎస్‌జీఎఫ్) కార్యదర్శి గుమ్మడి మధుజాన్సన్ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆర్ట్స్‌అండ్‌కామర్స్ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మధుజాన్సన్ 2025-26 సంవత్సరానికి క్రీడాసమాఖ్య కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి గంగాధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మధుజాన్సన్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, వి ఆంజనేయరావు, వెంకటరమణాచారి, శశిధర్ శర్మ, ఎ నిర్మల, సుధాకర్, బల్వీర్‌సింగ్, కళాశాల అధ్యాపక బృందం, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి, ఒలంపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

ప్రమాదకరంగా ఫైవింక్లయిన్ బస్‌షెల్టర్



శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న బస్‌షెల్టర్ పోల్

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలసంఖ్యలో ప్రయాణికులు వేచిచూసే గోదావరిఖని ఫైవింక్లయిన్ వద్ద ఉన్న బస్‌షెల్టర్ కూలిపోయే దశకు చేరుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సింగరేణి ఆధ్వర్యంలో ఫైవింక్లయిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బస్‌షల్టర్‌లోని ఐరన్ పోల్స్ శిథిలమై విరిగిపోయే దశకు చేరుకున్నాయి. యాచకులకు నిలయంగా మారిన ఈ బస్‌షల్టర్‌ను ఇటీవల ఆంధ్రజ్యోతి కథనంతో కార్పొరేషన్ సిబ్బంది శుభ్రం చేశారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడం, వర్షాకాలం కావడంతో ప్రయాణికులు బస్సుల కోసం బస్‌షల్టర్ వేచి చూస్తుంటారు. ఐరన్‌పోల్స్ ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు ప్రాణలు అరచేతిలో పెట్టుకుని బస్సుల కోసం వేచిచూస్తున్నారు. అధికారులు నూతన బస్‌షెల్టర్‌ను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇసుక లారీల పట్టివేత

గన్నేరువరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను గురువారం గుండ్లపల్లి స్టేజివద్ద పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.



హై లెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యేదెన్నడో?

- రెండేళ్లుగా శిలాఫలకాలకే పరిమితం
- వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలో హైలెవల్ వంతెనల నిర్మాణాలకు శిలాఫలకాలు వేసి రెండేళ్ల గడుస్తున్నా పనులు ప్రారభం కావడం లేదు. దీంతో వర్షాకాలంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయి. ఇబ్రహీంపట్నం నుంచి జిల్లా సరిహద్దు అయిన వర్షకొండ గ్రామం గుండా నిజామాబాదు జిల్లాకు వెళ్లే రహదారిపై రెండు లోలెవల్ వంతెనలు ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే వర్షపు నీరు వీటిపై నుంచి ప్రవహించి రాకపోకలు అంతరాయం ఏర్పడుతోంది. ఈ రెండు వంతెనల నిర్మాణానికి అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు 2023లో రూ.4 కోట్లు మంజూరు చేయించి భూమి పూజ చేశారు. గుత్తేదారులు పనులు దక్కించుకొని వంతెన నిర్మాణానికి పక్కన అప్రోచ్ రోడ్డు కోసం పైపులు తెప్పించి వదిలేశారు. ప్రభుత్వాలు మారడంతో వంతెన నిర్మాణానికి నాయకులు, అధికారులు చొరవ చూపడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలు పడినప్పుడు వర్షకొండ పెద్ద చెరువు మత్తడి దూకి లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహించి రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. దీంతో మండల కేంద్రానికి రావడానికి ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి వంతెనల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎం.డీ ఫయిజాన్: ఏఈ, రోడ్లు భవనాల శాఖ

వర్షకొండ, ఇబ్రహీంపట్నం మధ్య గల రెండు వంతెనల నిర్మాణం కోసం పనులు దక్కించుకున్న గుత్తేదారులతో మాట్లాడి పనులు ప్రారంభయ్యేలా చూస్తాం.

పీహెచ్‌డీ గైడ్‌షిప్ కోసం ఎస్సారార్ అధ్యాపకుల దరఖాస్తు



ఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు పీహెచ్‌డీ గైడ్ షిప్ కోసం దరఖాస్తులను సమర్పిస్తున్న ఎస్సారార్ అధ్యాపకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ అటానమస్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది అధ్యాపకులు పీహెచ్‌డీ గైడ్‌షిప్ కోసం శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు దర ఖాస్తు సమర్పించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్యకల్వకుంట రామకృష్ణ తెలిపారు. కళాశాల తెలుగు విభాగం నుంచి ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, కామర్స్ విభాగం నుంచి డాక్టర్ ఎం మల్లారెడ్డి, డాక్టర్ హర్‌జ్యోత్‌కౌర్, డాక్టర్ బూర్ల సరేష్, డాక్టర్ కెఅర్జున్, వృక్షశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ తిరు కోవెల శ్రీనివాస్, డాక్టర్ పడాల తిరుపతి వెరసి ఎనిమిది మంది అధ్యాపకుల దరఖాస్తులను యూనివర్సిటీకి సమర్పించినట్లు తెలిపారు. ఇటీవలే శాతవాహన యూనివర్సిటీ వారు కళాశాలలోని తెలుగు, కామర్స్, వృక్షశాస్త్ర విభాగాలను రీసెర్చ్‌సెంటర్లుగా గుర్తింపు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నితిన్ పారక్, టి రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, పరిశోధన కమిటీ సమన్వయకర్త డాక్టర్ ఎం మల్లారెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి (52) అనే వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలప్రకారం మహేందర్‌రెడ్డి ఎన్‌టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. వారంరోజుల నుంచి అధి కంగా మద్యం సేవిస్తున్నాడని గురువారం ఉదయం అందుగులపల్లి రైల్వేగేట్ వద్ద గూడ్సు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పి కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరదనీరు రావడం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 23 గేట్లు పైకి ఎత్తి 1,00,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 76.104 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ప్రాజెక్టులోకి గురువారం 15300క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా, ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరదకాలువ ద్వారా 14000క్యూసెక్కులు మానేరు, ములవాగు ద్వారా 1300క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టునుంచి దిగువఉన్న ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు ఒకగేట్‌ద్వారా వెయ్యి క్యూసెక్కులు, ప్యాకేజి10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 12800 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.44 ఉండగా, నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.118 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.75 టీఎంసీల నీరు ఉంది. సర్జిపూల్ ద్వారా నాలుగు పంపులతో 12800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయక సాగర్‌కు 9900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్ : కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయకాలువ ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. మిడ్‌మానేరు నుంచి 1000 క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ ద్వారా 1400 క్యూసెక్కులు మొత్తం 2400క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు దిగువకు, మిషన్ భగీరథ, ఆవిరిరూపంలో 305క్యూసెక్కులు మొత్తం 3305 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 22.707టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



కాకతీయ కాలువ ద్వారా దిగువకు వెలుతున్న నీరు

కొత్తపల్లి-హుస్నాబాద్ రహదారి నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్తపల్లి-హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి నిర్మాణం వేగవంతం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు వరుసల రహదారి కోసం ఇప్పటికే మార్కింగ్ పూర్తయినందున ఎలక్ట్రికల్ వర్క్స్, బావుల పూడ్చివేత, చెట్లు కత్తిరించడం వంటి పనులు వేగవంతంగా చేయాలన్నారు. ఇప్పుడున్న రహదారిని వెడల్పు చేస్తున్నందున గ్రామాల గుండా వెళ్తున్న రహదారి నిర్మాణం కోసం గ్రామసభలు ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని అన్నారు. అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించడం, కొత్తలైన్ ఏర్పాటు వంటిపనులను వేగవంతంగా చేయాలని అన్నారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి వరకు నిర్మంచనున్న ఈ రోడ్డు కోసం కరీంనగర్ జిల్లా పరిధిలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి, తదితర గ్రామాల పరిధిలో రోడ్లను ఆనుకొని ఉన్న బావులను పూడ్చివేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, జిల్లా అటవీశాఖఅధికారి బాలామణి, ఆర్‌అండ్‌బి ఈఈ నరసింహాచారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావులపై చర్యలు తీసుకోవాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి గిరిజన సంఘాల వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు గిరిజన సంఘాల నాయకులు గురువారం వినతి పత్రం అందించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మాట్లాడిన సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూక్య తిరుపతి నాయక్, గుగులోతు తిరుపతి నాయక్, రాజునాయక్, రవినాయక్, సదానందం, లక్పతినాయక్, మురావత్ సంతోష్, రాజన్‌నాయక్, లాకావత్‌రవి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నవోదయ విద్యార్థులు



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులు

చొప్పదండి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు నవోదయ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఒంగోల్‌లో జరిగిన రీజనల్‌స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. పదవతరగతి విద్యార్థి వంశీ, తొమ్మిదవ తరగతి విద్యార్థి కార్తి కేయ ఇండిజెనియస్ టాయ్స్‌మేకింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయి పోటీలు ఢిల్లీలో జరగనుండగా ఆర్ట్ టీచర్ గోక నాగేశ్వర్‌రావు, విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

లింగన్నపేటలో దొంగతనం

గంభీరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్న పేట గ్రామంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. ఎల్లం అనేవ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. 2గ్రాముల బంగారం, 10వేల నగదుతోపాటు గల్ఫ్ కరెన్సీని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇంటికి తాళం వేసి, పక్కనేఉన్న ఇంట్లో ఎల్లం కుటుంబీకులు నిద్రించారు. దీంతో ఇంటి తాళాన్ని పగులగొట్టి దొంగతానికి పాల్పడ్డారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల



చీమలపేట గ్రామంలో శిథిలమైన ప్రభుత్వ పాఠశాల

జూలపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేటలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆ పాఠశాలలో చదువుకునే 45 మంది విద్యార్థులు భయం భయంగా చదువు కొనసాగిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పైకప్పు పెచ్చులు రాలి పోవడమే కాకుండా పైకప్పు కొంత భాగం కూలిపోయి ప్రమాదకరంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పాఠశాల సమీప ఇంటిఆవరణలో అరకొర వసతులతో విద్యార్థులు చదువులను వెళ్లదీస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలకు మరమ్మతు చేయడానికి రూ.9లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఉన్నతాధికారులు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు పక్కాభవనం నిర్మించి విద్యార్థులకు అన్ని వసతులను కల్పించాలని గ్రామస్థులు కోరు తున్నారు.

ధర్మపురిలో ముగిసిన భాగవత సప్తాహం

ధర్మపురి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భాద్రపద మాసం పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలోని శ్రీలక్ష్మీ గణేష్ రైస్‌మిల్‌లో పురాణ ప్రవచకులు ఇనుగంటి రామ్మోహన్‌రావు గారి భాగవత సప్తాహం కార్యక్రమం గురువారం ముగిసింది. ఎనిమిదిరోజుల నుంచి రామ్మోహన్‌రావు శ్రీకృష్ణుని చరిత, శ్రీ కృష్ణుని లీలలు, ప్రహ్లాద చరిత్ర, ధృవుని చరిత్ర, వామన చరిత్ర, భక్తుల చరిత్ర గురించి నిత్యం గంటల తరబడి ప్రవచనాలు చేశారు. వందలాది మంది ఎంతో ఓపికతో, భక్తిశ్రద్ధలతో విని శ్రవణానందం పొందారు. ముగింపు రోజున ప్రవచనాలు చేసిన ఇనుగంటి రామ్మోహన్‌రావు దంపతులను ఆలయ మాజీధర్మకర్త ఇనుగంటి రమాదేవి-వేంకటేశ్వర్‌రావు దంపతులు ఘనంగా సన్మానించి, నగదు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ ట్రేడర్స్ ఇనుగంటి వినోద్‌రావు, ఇనుగంటి వేంకటేశ్వర్‌రావు, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి రంగ శంకరయ్య, గునిశెట్టి మల్లేశం, భీమనాతి అశోక్, గునిశెట్టి రవీందర్, అక్కెనపెల్లి మురళీధర్, ఉత్తూరి సత్తయ్య, బొల్లం హరిప్రసాద్, నాగేశ్వర్‌రావు, కొండ వినయ్ కుమార్, రంగ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.4 కోట్లతో పరారైన దంపతుల పట్టివేత

- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో గుగ్గిళ్ల రమేష్-గాయత్రి దంపతులు రూ.1.40కోట్లతో నాలుగు నెలల క్రితం ఉడాయించగా బుధవారం బాధితులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ప్రైవేట్‌ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్న రమేష్ గ్రామంలో చిట్టీలతోపాటు ఫైనాన్స్ నడుపుతుండేవాడని బాధితులు తెలిపారు. చిట్టీ అవసరం లేని వారిని గుర్తించి వారికి వచ్చే డబ్బులను తమ వద్దనే ఉంచుకొని వడ్డీ ఇస్తామని చెప్పేవారు. అదేవిధంగా గ్రామంలో కొంత మంది వద్ద పెద్దమొత్తంలో అప్పు తీసుకున్నట్లు తెలిసింది. డబ్బులు తిరిగే చెల్లించలేక నాలుగునెలల క్రితం రమేష్-గాయత్రి దంపతులు గ్రామం నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు వీరికోసం వెతుకుతుండగా బుధవారం సాయంత్ర కోరుట్ల కోర్టు వద్ద రమేష్ కనిపించాడు.

బాధితులు రమేష్‌ను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. కొంతమంది బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. కాగా రమేష్-గాయత్రి దంప తులు ఇప్పటికే కోర్టు నుంచి బాధితులకు నోటీసులు పంపినట్లుగా తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా పలువురి ఎంపిక



డాక్టర్ కోడూరి శ్రీవాణిని అభినందిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్/ఎలిగేడు/పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగం అధిపతిగా, విశ్వవిద్యాలయ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కోడూరి శ్రీవాణి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా కే.అర్జున్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ 5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాదులోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోనున్నారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడుకు చెందిన శ్రీవాణి శాతవాహన విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో సీనియర్ సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే పరిశోధనా రంగంలో అత్యుత్తమ పనితీరును కనబరుస్తున్నారు. ఈ సందర్భంగా కోడూరి శ్రీవాణిని ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్ అభినందించారు.



డాక్టర్ కె అర్జున్

పెద్దపల్లి జిల్లా నిమ్మనపల్లికి చెందిన అర్జున్ 12 సంవత్సరాలుగా కామర్స్ బోధనతో పాటు 12 జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో తన పరిశోధనపత్రాలను ప్రచురించారు. ఈ సందర్భంగా అర్జున్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. రామకృష్ణ, టీజీసీజీటీఏ. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నితిన్ పారక్ అధ్యాపకులు అభినందించారు.

జగిత్యాల నుంచి..

జగిత్యాల: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో రసాయన శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ నీలి వాసవి, ఎస్‌కేఎన్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న జంతు శాస్త్ర లెక్చరర్ పార్లపల్లి రాజు ఎంపికయ్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు జాబితాలో నీలివాసవి, రాజుకు అవ కాశం దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరుగనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. కాగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయిన డాక్టర్ నీలి వాసవిని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, చరిత్ర లెక్చరర్ సాసాల మల్లికార్జున్, ఇంగ్లీష్ లెక్చరర్ జ్యోష్ణ, తెలుగు లెక్చరర్ డాక్టర్ జి శ్రీలత తదితరులు అభినందనలు తెలిపారు.



డాక్టర్ నీలి వాసవి



పార్లపల్లి రాజు

ఉత్తమ లైబ్రేరియన్‌గా శంకరయ్య

కోల్‌సిటీటౌన్ : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుల అవార్డుకు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ పల్లె శంకరయ్య ఎంపికయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చల్లగరిగ గ్రామానికి చెందిన శంకరయ్య 2002లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌లో గెజిటెడ్ లైబ్రేరియన్‌గా నియమితులయ్యారు. 2024లో గోదావరిఖనికి బదిలీపై వచ్చారు. 32ఏళ్లుగా విద్యారంగంలో సేవలు అందిస్తున్న శంకరయ్య, ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారిగా 18ఏళ్లు పనిచేశారు. శంకరయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంపై గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసింది.

శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేయాలి


సుల్తానాబాద్‌లో నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో నిమజ్జన వేడుకలు నిర్వహించాలని ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. గురువారం పెద్ద చెరువును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు శాంతియుతంగా ఊరేగింపు నిర్వహించాలని, భక్తి శ్రద్ధలతో నిమజ్జన వేడుకలను పూర్తి చేయాలని కోరారు. నిమజ్జనానికి తరలివచ్చే భక్తులు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని, విద్యుత్ తీగలు, కరెంటు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మంచి నీరు, వైద్యసేవలు అందుబాటులో ఉంచాలన్నారు. కట్టపై క్రేన్లు, బారీకేట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రశాంతంగా వేడుకలు ముగించుకోవాలన్నారు. పట్టణంలోని మండపాలను ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, గాజుల రాజమల్లు, సీఐ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, మండల అధ్యక్షుడు చిలుక సతీష్, సాయిరి మహేందర్, పడాల అజయ్ గౌడ్, రాజలింగం, పన్నాల రాములు, కుమార్ కిషోర్, కల్లేపల్లి జానీ, సంతోష్ రావు, రాజయ్య, రఫీక్, ఎస్ఐ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 61 ఫీట్ల భారీ మట్టి గణపతితోపాటు పలు కాలనీల్లో నెలకొల్పిన గణపతులను ఎమ్మెల్యే విజయరమణారావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అన్న సంతర్పణలో పాల్గొని భక్తులకు వడ్డించారు. గణపతి నవరాత్రులను భక్తి శ్రద్ధలతో జరుపుకున్న మాదిరిగానే అంతే నిష్టతో నిమజ్జనం చేయాలన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జన వేడుకలను జరుపుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శివపల్లి, ఎలిగేడు గ్రామాల్లో గణనాథులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమానికి చెరువులను సిద్ధం చేశామన్నారు.పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, నాయ కులు దుగ్యాల సంతోష్ రావు, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయ భాస్కర్ రెడ్డి, అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, నరహరి సుధాకర్ రెడ్డి, కోరుకంటి వెంకటేశ్వర్ రావు, రమేష్‌బాబు, కాసార్ల మహేందర్, స్వామి, రమేష్, బాలసాని పర్శరాములుగౌడ్, తిరుపతి, పెద్దపల్లి దేవరాజ్, పుల్లారావు, రాజనర్సు, బూర్ల సత్యం పాల్గొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో డీఎల్‌పీఓ వేణుగోపాల్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, తహసీల్దార్ యాకయ్యలు గణపతి నిమజ్జన ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మధుకర్, కార్యదర్శులు, మెడికల్ ఆఫీస ర్లు నిస్సా క్రిస్టానా, విద్యుత్ ఏఈ సంపత్ రెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్ సూర్య నారాయణ, లైన్‌మెన్లు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం జరుగనున్న గణపతి నిమజ్జన ఏర్పాట్లు, శోభాయాత్రపై క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సమీక్ష జరిపారు. ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఉత్సవ సమితి అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు దాడి శ్రీనివాస్, వెంకన్న, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ ధీరజ్‌కుమార్, ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈత రానివారు నీటిలోకి దిగవద్దని, ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలని అన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల నిర్వాహకులు నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ సజావుగా నిర్వహిం చుకోవాలని తహసీల్దార్ రాజయ్య అన్నారు. అప్పన్నపేట చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీలత, నిషాంత్, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సంతోష్‌లు ఉన్నారు.

కుంకుమ పూజలు.. అన్నదానాలు...

కళ్యాణ్‌నగర్,(ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రజలను గణనాథుడు చల్లగా చూడాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వేడుకున్నారు. గురువారం


రామగుండం మండలంలో వినాయకుడి వద్ద నైవేద్యాలు


ఖనిలో 101 రకాల నైవేద్యాలు సమర్పించిన భక్తులు

పలు మండపాల్లో పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జీఎం కాలనీలోని సంజీవ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎస్‌సీ మోర్చ జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ పూజ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 12వ డివిజన్ విఠల్‌నగర్‌తోపాటు పలు మండపాల్లో ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. మల్లికార్జున్‌నగర్‌లోని గణనాథుని వద్ద 101రకాల నైవేద్యాన్ని గణనాథునికి సమర్పించారు.

జ్యోతినగర్(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఏరియాలోని మండపాలలో గణేశుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కృష్ణానగర్‌లోని ఎస్ఆర్‌ఎం అపార్ట్‌మెంట్, రాధాకృష్ణ ఆలయం, అన్నపూర్ణకాలనీ, టౌన్‌షిప్‌లో నవరాత్రోత్సవాలను నిర్వహించారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీ జోన్-2 సార్వజనిక గణేష్ ఉత్సవ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం 118 రకాల పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పురగిరి క్షత్రియ పెరిక సంఘం అధ్యక్షుడు కానుగంటి ఎర్ర శంకరయ్య, సోమిశెట్టి లింగయ్య, బేరం కుమార్, రామినేని రాజేంద్రప్ర సాద్, అనిల్, అల్లం తిరుపతి, రామినేని శివ, సతీష్, మహేందర్ పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనానికి సర్వం సిద్ధం

(3వ పేజీ తరువాయి)

ప్రవాహం ఎక్కువగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. రోడ్డు సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, లైటింగ్, తాగునీరు, వైద్య సౌకర్యాలు, అగ్నిమాపక చర్యలు, శానిటేషన్, తదితర చర్యల గురించి చర్చించారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ


కమాన్‌పూర్ మండలంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామా ల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆయా మండపాల వద్ద చేపట్టిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వాహకులు చేపట్టారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): పుట్టపాక, నగరంపల్లి గ్రామాలలోని గణనాథులను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులందరూ పాడి పంటలతో సిరి సంపదలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. శ్రావణ్, ప్రభాకర్, తిరుపతి రెడ్డి, రమేష్, సురేష్‌లు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

పెద్దపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోని గణేష్ నిమజ్జనం జరగనున్న చోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి.వాణిశ్రీ ఆదేశించారు. గురువారం ప్రోగ్రాం అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. రామగుండంలో గోదావరిఖని బ్రిడ్జి, గోదావరిఖని చౌరస్తా, అంతర్గాం మండలంలో గోలివాడ, పెద్దపల్లిలో ఎల్లమ్మ చెరువు, సుల్తానాబాద్, మంథనిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. జ్వరం కేసులకు డెంగ్యూ రాపిడ్ టెస్టులు చేయాలని, పాజిటివ్ వచ్చిన వారి శాంపిల్స్‌ను ఏలీసా టెస్టు టి-హబ్‌కు పంపించి, నిర్ధారించాలన్నారు. వైద్యులు శ్రీరాములు, సుధాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి అరుదైన ఆపరేషన్


మాట్లాడుతున్న డాక్టర్ నివేద్‌రావు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్టు యశోద ఆసుపత్రి సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ నివేద్‌రావు పేర్కొన్నారు. గురువారం గోదావరిఖనిలో జరిగిన విలేకరుల సమావేశంలో సర్జరీ వివరాలు వెల్లడించారు. రాజేష్ కన్నా మంచిర్యాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అతనికి కిడ్నీలో నీటి బుడగలు ఏర్పడ్డాయి. రాజేష్‌కన్నాకు హైదరాబాద్ యశోదలో డావిన్సీ రోబోటిక్ సర్జికల్ సిస్టం ఉపయోగించి మూత్రపిండాల పని తీరుకు ఇబ్బంది కలుగకుండా సర్జరీని నిర్వహించామన్నారు సమావేశంలో సర్జరీ చేయించుకున్న రాజేష్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ల ఫోరం సలహాదారుడిగా రూప్లానాయక్

ధర్మారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం సలహాదారుడిగా ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లాలో బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ల సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికకు సహరించిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు రూప్లానాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లోని యూనియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వారు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు.

ఘనంగా ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం


ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

కమాన్‌పూర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. రొంపికుంట ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వేగోళం సత్యనారాయణ గౌడ్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ చదువు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు లభిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ రాజమణి, ఉపాధ్యాయులు భూలక్ష్మి, గౌతమి, ప్రియాంక, జేబా, నాగరాణి, రాణి పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రిన్సిపాల్ గోల్డి బల్బీర్ కౌర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురు వుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతీ ఒక్క విద్యార్థి విద్యాబుద్ధులు చెప్పే గురువును అనుసరించి అభివృద్ధి చెందాలని కోరా రు. ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్‌కు మెమోం టో అందించి సన్మానించారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపల్లిలో జేమ్స్ మోడల్ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వ హించారు. విద్యార్థులు ఉపా ధ్యాయ వేషధారణతో పాఠాలు బోధించారు. కరస్పాం డెంట్ జాలపల్లి మహేష్, స్వప్న, ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి హాజరై రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ డి.కల్పన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రప టానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



జెమ్స్‌మోడల్ పాఠశాలలో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మారేడు గొండ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జానకీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

ఎన్టీపీసీ ఉద్యోగులకు డబుల్ ధమాకా

జ్యోతినగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ ఉద్యోగులకు రెండు ప్రత్యేక బహుమతులను అందించనుంది. ఎన్టీపీసీ సంస్థ స్థాపించి 50 ఏళ్లు, అలాగే సంస్థ స్థాపిత సామర్థ్యం 75 వేల మెగావాట్లు దాటిన సందర్భాలను పురస్కరించుకొని ఉద్యోగులకు నజరానాలను అందిస్తుంది. గురువారం ఢిల్లీలో ఎన్టీపీసీ సీఎండీ గుర్‌దీప్ సింగ్ సమక్షంలో జరిగిన ఎన్‌జేపీసీ(నేషనల్ జాయింట్ పర్ఫార్మెన్స్ కమిటీ) సమావేశంలో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. సమావేశంలో ఎన్టీపీసీ డైరెక్టర్ (హెచ్‌ఆర్) అనిల్ కుమార్ జాడ్లీ, ఇతర విభాగాల డైరెక్టర్లు, ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు. 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక బహుమతి ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. నవంబర్ 7న ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు అందించనున్నారు. అలాగే కేరీర్ డెవలప్‌మెంట్ స్కీం కింద ఉన్నత చదువులు చదివిన ఉద్యోగులకు పదోన్నతులకు అంగీకరించింది. అన్ని కేటగిరి ఉద్యోగులకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వనున్నారు. ఎన్టీపీసీ సంస్థలో త్వరలోనే కొత్త ఉద్యోగ నియామకాలను చేపట్టేందుకు సీఎండీ అంగీకరించారని బాబర్ తెలిపారు. రామగుండం గుర్తింపు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వేముల కృష్ణయ్య, ఆరెపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.

జిల్లా టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

మంథని, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాథ్స్ అండ్ సైన్స్ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మంథని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం గీట్ల భరత్‌రెడ్డి గురువారం తెలిపారు. పెద్దపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన టెస్టులో విద్యార్థులు సెకండరీ స్థాయిలో బీ. విక్రాంత్ ప్రథమ, ఎన్ పరమేష్ ద్వితీయ స్థానంలో నిల్చినట్లు తెలిపారు. ఎలిమెంటరీ స్థాయిలో బీ. ఠాగూర్ జిల్లా ప్రథమ స్థానంలో నిల్చినట్లు తెలిపారు.

గ్రామాలలో యూరియా పంపిణీ

మంథనిరూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామాల వారీగా రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు గురువారం తెలిపారు. రైతులకు మూడు రోజులనుంచి 100 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ నెల 8 నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో ఈ నెల 8 నుంచి మూడు రోజులపాటు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సుల్తానాబాద్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాలకు చెందిన జట్లు పాల్గొంటాయని, 8న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 9న బాలురకు పోటీలు ఉంటాయన్నారు. 10న బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని, అండర్ 14లో 2012 జనవరి 1న, తర్వాత జన్మించిన వారు, అండర్ 17లో 2009 జనవరి 1న, తర్వాత జన్మించి ఉండాలన్నారు. పాల్గొనే వారు జోనల్ కార్యదర్శి దాసరి రమేష్ 9490674874, మండల కన్వీనర్ ప్రణయ్ 9618336976 సంప్రదించాలన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్‌ని గురువారం సుల్తానాబాద్‌కు చెందిన బీజేపీ నాయకులు కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి తెలిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి కందునూరి కుమార్, ఉపాధ్యక్షుడు గజభీంకర్ పవన్, ఛత్రపతి శివాజీ అధ్యక్షుడు ఎనగందుల సతీష్, కొల్లూరి కుమార్ ఉన్నారు.

పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

కమాన్‌పూర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెంచికల్‌పేటలో వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం పంటలను సందర్శించారు. వరిలో ఆకునల్లి ఉధృతి ఉందన్నారు. దీని నివారణలో రైతులు ఒబెరాన్ మందులను ఒక ఎంఎల్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కాండం కుళ్లు ఆశించిన లక్షణాలు గమనించామని దీని నివారణకు హెక్సాకొనజల్ 2 ఎంఎల్‌కు ఒక లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు సతీష్ చంద్ర, రజనీకాంత్, రాజేంద్ర ప్రసాద్, ప్లాంట్ పెథాలజీ రైతు విజ్ఞాన కేంద్రం రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, రైతులు పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతు సంఘం జిల్లా అడహక్ కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ల వెంకటరెడ్డి పెగడపల్లిలో ఎన్నుకున్నారు. పెగడపల్లికి చెందిన పత్తి శ్రీనివాసరెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి దుర్గయ్య, యాకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు మంద రాజేందర్, బూడిద గణేష్ పాల్గొన్నారు.

భూమి బదలాయింపుపై విచారణ

ఎలిగేడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎలిగేడు గ్రామపంచాయతీలో భూమి బదలాయింపుపై డీఎల్‌పీఓ వేణుగోపాల్ విచారణ జరిపారు. గురువారం సాదుల పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో రికార్డులను పరిశీలించారు. ఎంపీఓ కిరణ్, పంచాయతీ కార్యదర్శి అంజలి ఉన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గంగారంలో తాగునీటి పైపులైన్ పనులను మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ గురువారం ప్రారంభించారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా, స్పందించిన ఆయన రూ.4 లక్షలు మంజూరు చేశారు. పైప్‌లైన్ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ ఈద సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నేదురు రమేష్, బద్రి, నాయకులు మస్కు మధు, గుడ్ల సంపత్, మేడి అశోక్ గౌడ్, పర్శరాములు గౌడ్, బాలే శివ ప్రసాద్, ఓదెలు, రామయ్య, రవి, అంబాల రాజేందర్ పాల్గొన్నారు.

మైన్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాలకుర్తి,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ అల్ట్రాటెక్ కంపెని మైన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గురువారం కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షు డు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి మైన్స్ హెడ్ సాహూ తో చర్చలు జరిపారు. యూనియన్ ప్రధానకార్యధర్శి మాదాసు శ్రీనివాస్, బత్తిని సతీష్, తీగల తిరుపతి, భైరం మల్లయ్య, భైరి రామకృష్ణ, పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో చేరేందుకు అడ్మిషన్ ఫీజు చెల్లించండి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివ ర్సిటీ డిగ్రీలో చేరేందుకు ఈనెల 12వ తేదీలోగా అడ్మిషన్ ఫీజు చెల్లించా లని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ, తృతీయ విద్యార్థులు 12వ తేదీ వరకు ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు సెల్.7382929655లో సంప్రదించాలని కోరారు.



ప్రజాభవన్ ముట్టడిని విజయవంతం చేయాలి


పోస్టర్ అవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు, కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈనెల 12న ప్రజాభవన్ ముట్టడిని విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఓసీపీ-3 కృషిభవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. హామీల అమలుకు ఎటువంటి శ్రద్ధ చేపడంలేదని జేఏసీ నాయకులు తెలిపారు. రాజేందర్, ఓదేలు, శ్యామల, రమ, స్వప్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దసరా సెలవు తేదీని మార్చండి

గోదావరిఖని, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ అక్టోబరు2న గాంధీ జయంతి రోజు రావడం వల్ల కార్మికులు, ఉద్యోగులు ఒక పెయిడ్ హాలిడేను నష్టపోవాల్సి వస్తుందని, మరో అనుకూలమైన తేదీని ప్రత్యామ్నాయ సెలవుగా పరిగణించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు. అక్టోబరు 2న గాంధీ జయంతి సెలవుతో పాటు దసరా సెలవును కూడా మరో రోజు కార్మికులకు సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రక్షణ పక్షోత్సవాల బహుమతుల ప్రదానం

గోదావరిఖని, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు 2023కు సంబంధించి ఓపెన్ కాస్ట్‌మైన్స్ గ్రూప్-3లో భాగంగా జీడీకే కోల్ మైన్ పిట్ సేఫ్టీ కమిటీకి ప్రథమ, ఉత్తమ ఓబి రిమూవల్ కాంట్రాక్ట్ కింద వీసీ పటేల్ కాంట్రాక్ట్ ఏజెన్సీకి ద్వితీయ బహుమతి లభించింది. ఈ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ హాజరై అధికారులను, కార్మికులను, అభినందించారు. గని ఉద్యోగులందరికి కూల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. ప్రాజెక్ట్ అధికారి డీ రమేష్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మడ్డి ఎల్లయ్య, ఏరియా ఇంజనీర్ పీ రమేష్, గని స్టాట్యూటరీ మేనేజర్ డీ రమేష్ బాబు, గని మేనేజర్ అనిల్ గబాలే, రక్షణాధికారి, సీఎంఓఏఐ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పొనుగోటి శ్రీనివాస్, సీఎంఓఏఐ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెరుమాళ్ళ శ్రీనివాస్, నాయకులు రంగు శ్రీనివాస్, మదన మహేష్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు ప్రారంభం

రామగిరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో గురువారం జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను నిర్వహించారు. నేత్ర, శరీర, అవయవ దానాలపై నూక రమేశ్ అవగాహన కల్పించారు. సుమారు 50 మంది డోనర్స్ ముందుకు రాగా సర్టిఫికేట్‌లను అందజేశారు. ఏపీఏ జీఎం నాగేశ్వర్‌రావు, ఎస్‌వోటూజీఎం బండి సత్యనారయణ, మేనేజర్ సుజిత్, వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు సాన రామకృష్ణ, ప్రచార కార్యదర్శి వాసు, సలహదారుడు రాజిరెడ్డి, కన్వీనర్ వెంకటరమణరెడ్డిలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి

గోదావరిఖని, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికి లాభాల్లో వాటా చెల్లించాలని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆర్‌జీ-1 అధ్యక్షుడు ఎంఏ గౌస్ డిమాండ్ చేశారు. గురువారం సెక్టార్-1 కమ్యూనిటీ హాల్‌లో, బీగెస్ట్‌హౌస్‌లో కాంట్రాక్టు కార్మికులతో కలిసి మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం పంపిన సిఫార్సులను ఆమోదించి తక్షణమే వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఆగస్టు నుంచి డిసెంబర్‌లోగా ఈఎస్ఐ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన యాజమాన్యం అందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికి 7వ తేదిలోపే వేతనాలు చెల్లించాలని గౌస్ కోరారు.

కోల్‌ఇండియా స్థాయిలో రాణించాలి


చెస్ అడుతున్న జీఎంలు

రామగిరి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోల్‌ఇండియా స్థాయిలో రాణించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు క్రీడాకారులకు పిలుపునిచ్చారు. గురువారం రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలోని సీఈఆర్ క్లబ్‌లో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు ప్రారంభించారు. చెస్, క్యారమ్స్ పోటీలను ప్రారంభించారు. కోల్‌ఇండియా స్థాయిలో సింగరేణికి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. వై.వీరావు, కొటరవీందర్ రెడ్డి, అధికారులు రామ్మోహన్, సుదర్శనం, సాయిస్వరూప్, క్రీడల సమన్వయకర్త జవ్వాజి అంజయ్య, మహిళరిప్రజెంటివ్ మమత పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈనెల 7న జరగనున్న కాంట్రాక్టు కార్మికుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను గురువారం కార్మికులు కాలనీలో ఆవిష్కరించారు. యూనియన్ ఉపాధ్యక్షుడు అశోక్ మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు శ్రమకు తగిన వేతనాలు అందడం లేదని, కోల్ ఇండియాలో హైపవర్ వేతనాలు అమలు చేస్తున్నా సింగరేణిలో అమలు కావడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు ఇవ్వాలని, సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వాలని, లాభాల్లో 15శాతం వాటా చెల్లించాలని అశోక్ డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో శాంతమ్మ, నర్సన్న, శంకర్, రాజేశం, దుర్గమ్మ, స్వరూప, శేఖర్, గట్టయ్య పాల్గొన్నారు.